
Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్






IRS PUBLICATIONS
irspublications12@gmail.com



సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 299 | శుక్రవారం 15 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## శబరిమల కేసులో తీర్పు రిజర్వ్

- మే 29లోపు లిఖితపూర్వక వాదనలకు అనుమతి సుప్రీంకోర్టు
- అయ్యప్ప ఆలయంలో మహిళలపై వివక్ష అంశంపై ముగిసిన వాదనలు

2లో

## ఢిల్లీలో మరో నిర్భయ

- కదులుతున్న బస్సులో మహిళపై సామూహిక లైంగికదాడి
- డ్రైవర్, కండక్టర్ అరెస్ట్
- దేశ రాజధానిలో మహిళలకు భద్రత కరువు : మహిళా సంఘాలు
- బీజేపీ ప్రభుత్వంలో ప్రజలకు రక్షణేది? : ఆప్

2లో



## మూడో దశ 'సర్' షెడ్యూల్ విడుదల

- తెలంగాణ, ఏపీతో పాటు 16 రాష్ట్రాలు, ?
- మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రక్రియ

2లో







## కర్ణాటకలో హిజాబ్‌పై నిషేధం ఎత్తివేత..

2లో


- కాంగ్రెస్ సర్కార్ కీలక నిర్ణయం
- హిజాబ్‌తో పాటు జనివారం, తలపాగా వంటి వాటికి అనుమతి
- గత బీజేపీ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసిన కాంగ్రెస్ సర్కార్
- మత విశ్వాసాల మధ్య సమతుల్యం కోసమే నిర్ణయమన్న ప్రభుత్వం



## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు.. పది మంది కార్మికులు మృతి

2లో

## కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్



- కేరళ రాజకీయాల్లో ఉత్కంఠకు తెర..
- కాంగ్రెస్ పార్టీలో కొత్త తరానికి పట్టం కట్టిన అధిష్ఠానం
- పలువురు సీనియర్లను కాదని సతీశన్ వైపు మొగ్గు చూపిన రాహుల్ గాంధీ
- ప్రతిపక్ష నేతగా ప్రభుత్వ వ్యతిరేక పోరాటంతో గుర్తింపు
- వర్గ రాజకీయాలకు అతీతంగా ఎదగడం సతీశన్‌కు కలిసివచ్చిన అంశం

తిరువనంతపురం - సూర్య వాస్తవం

కేరళ రాజకీయాల్లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర 13వ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రతిపక్ష నేత వీడీ సతీశన్‌ను ఎంపిక చేస్తూ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు దీప్‌దాస్ మున్షీ, ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ ఈ ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో కేరళ కాంగ్రెస్‌లో ఒక తరం మారిపోయిందని, కొత్త శకం ఆరంభమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సీఎం రేసులో ఉన్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వయంగా ఫోన్ చేసి, సతీశన్‌ను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కూడా

- మిగతా 2లో..






## సంక్షోభాల నివారణలో బ్రిక్స్ నిర్మాణాత్మక పాత్ర

### - సభ్య దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో జైశంకర్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

అంతర్జాతీయ సంక్షోభాల నివారణలో బ్రిక్స్ కూటమి నిర్మాణాత్మకంగా, స్థిరత్వాన్ని అందించే పాత్రను పోషిస్తుందని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రిక్స్ -- 2026 సభ్య దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం గురువారం నాడు న్యూఢిల్లీలోని 'భారత్ మండపం'లో ప్రారంభమైంది. ఈ సమావేశంలో జైశంకర్ స్వాగతోపన్యాసం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనిక ఘర్షణలు, ఆర్థిక అనిశ్చితులు, వాణిజ్య అవరోధాలు, సాంకేతికత సవాళ్లు, వాతావరణ మార్పులు ప్రపంచ స్వరూపాన్ని మార్చేస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ఆయన తెలిపారు. ప్రపంచ, ప్రాంతీయ పరిణామాలపై సమీక్షించుకోవడానికి, ఈ సంక్లిష్ట పరిస్థితుల్లోనూ పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకునే ఆచరణాత్మక మార్గాలను వెతుక్కోవడానికి ఈ సదస్సులో జరిగే చర్చలు అవకాశాన్ని కల్పిస్తాయన్నారు.

- మిగతా 2లో..

## 'నీట్' రద్దు...మోడీ సర్కార్ ఫెయిల్యూరే

- ఆయన హయాంలోనే 93 పేపర్లు లీక్ అయ్యాయి
- ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు
- కేంద్రం తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్



3లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## 'నా దేశం -- నా బాధ్యత' పేరిట పొదుపు చర్యలు

- నిర్ణయాలపై 48 గంటల ముందుగా ప్రజలకు సమాచారం
- మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి - సూర్య వాస్తవం

"నా దేశం-నా బాధ్యత' పేరిట రాష్ట్రంలో విస్తృతంగా పొదుపు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం ఆయన మంత్రులతో విడిగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో తీసుకోవాల్సిన పొదుపు చర్యలపై పలు అంశాలను చర్చించారు. పొదుపు చర్యల్లో ప్రతి ఒక్కరిని భాగం చేయాలని, దీనికోసం విస్తృతంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు సిఎం చెప్పారు.



కాన్వాయ్‌ల్లో కార్ల సంఖ్యను తగ్గించడం ఒక్కటే చాలదని, ఇతర మార్గాలను అన్వేషించాలని సూచించారు. మంత్రులు విదేశీ పర్యటనల్లోనూ, జిల్లా పర్యటనల్లోనూ కాస్ట్ కటింగ్ విధానాలు పాటించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎయిర్ కండీషనర్ల టెంపరేచర్‌ను 26-24 మధ్యే ఉండేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో కూడా ఖర్చులు తగ్గించాలని సూచించారు. వర్చువల్

- మిగతా 3లో..

## నీట్' పరీక్షను ఎత్తేయండి

### - 12వ తరగతి మార్కులు ఆధారంగా ప్రవేశాలు కల్పించాలి
### - కేంద్రానికి తమిళనాడు సిఎం విజయ్ లేఖ

చెన్నై- సూర్య వాస్తవం: దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశానికి 'జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీ'ని (నీట్-యుజి) మొత్తానికే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ డిమాండ్ చేశారు. 12వ తరగతిలో మార్కులతోనే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని తెలిపారు. ఈ మేరకు

- మిగతా 3లో..





## చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?

- ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై జగన్ స్పందన
- ఫీడ్ కంపెనీలతో కూటమి ప్రభుత్వం కుమ్మక్కైందంటూ తీవ్ర విమర్శలు
- ధరలు తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్
- లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరిక

అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా ఫీడ్ ధరల పెంపు అంశంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు,

- మిగతా 2లో..

# శబరిమల కేసులో తీర్పు రిజర్వ్

**- మే 29లోపు లిఖితపూర్వక వాదనలకు అనుమతి : సుప్రీంకోర్టు**
**- అయ్యప్ప ఆలయంలో మహిళలపై వివక్ష అంశంపై ముగిసిన వాదనలు**

న్యూఢిల్లీ –సూర్య వాస్తవం

శబరిమల ఆలయంతో సహా వివిధ మతపరమైన ప్రదేశాల్లో మహిళల పట్ల వివక్ష, మతస్వేచ్ఛ విషయంలో దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును 16రోజులపాటు విచారణ జరిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాదులు సి.ఎస్. వైద్యనాథన్, అభిషేక్ సింఘ్వి, ముకుల్ రోహత్గీ, ఇందిరా జైసింగ్‌ల వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.విచారణకు ముందు శబరిమల ఆలయంలోకి రుతుక్రమం వయస్సున్న మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని సమర్థించాలని కేంద్రం లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినది అయినందున న్యాయసమీక్ష పరిధిలోకి రాదని పేర్కొంది. 2018 సెప్టెంబర్‌లో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. 2019 నవంబర్‌లో అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్ ఈ వివాదంతోపాటు ఇతర మతాల్లోని మహిళలపై వివక్ష అంశాలను 9మంది సభ్యులతో కూడిన ధర్మాసనానికి బదిలీ చేసింది.

# కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ సమావేశమై ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. రోజుల తరబడి సాగిన తీవ్రమైన లాబీయింగ్, చర్చల తర్వాత హైకమాండ్ సతీశన్ వైపే మొగ్గు చూపింది.

**సతీశన్ రాజకీయ ప్రస్థానం**

కొచ్చి జిల్లాకు చెందిన 62 ఏళ్ల సతీశన్, వృత్తిరీత్యా న్యాయవాది. 2001లో పారావూర్ నుంచి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. తన వాగ్ధాటి, గణాంకాలతో కూడిన ప్రసంగాలతో అసెంబ్లీలో అధికార పక్షాన్ని ఇరుకున పెట్టడంలో ఆయనకు మంచి పేరుంది. కేరళ కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయించిన 'ఏ', 'ఐ' వర్గాలకు అతీతంగా ఉండటం ఆయనకు కలిసివచ్చింది. ఇది యువ నాయకులను, కార్యకర్తలను ఆయన వైపు ఆకర్షించింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా ప్రతిపక్ష నేతగా ఎంపికైన సతీశన్, ఆ పదవిని తన రాజకీయ ఎదుగుదలకు సోపానంగా మార్చుకున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, ఏఐ కెమెరాల ఆరోపణల వంటి అంశాలపై పినరయి విజయన్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, వామపక్ష వ్యతిరేక రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగారు. ఇప్పుడు ప్రతిపక్ష నేత స్థానం నుంచి ముఖ్యమంత్రి కుర్చీకి మారబోతున్న సతీశన్‌పై భారీ అంచనాలున్నాయి. కేవలం ప్రభుత్వాన్ని నడపడమే కాకుండా ఎన్నికల పరాజయాలతో నిస్తేజంగా మారిన పార్టీకి కొత్త ఊపునిచ్చి, వామపక్షాల ప్రాబల్యాన్ని ఎదుర్కోవాల్సిన పెద్ద బాధ్యత ఆయనపై ఉంది.

# కర్ణాటకలో హిజాబ్‌పై నిషేధం ఎత్తివేత..

బెంగళూరు – సూర్య వాస్తవం

కర్ణాటకలోని పాఠశాలల్లో హిజాబ్ వివాదంపై కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై విద్యార్థులు హిజాబ్‌తో పాటు జనివారం, తలపాగా వంటి మత, సంప్రదాయ చిహ్నాలను ధరించేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు 2022లో గత బీజేపీ ప్రభుత్వం జారీ చేసిన నిషేధ ఉత్తర్వులను రద్దు చేసింది. విద్యాశాఖ ఖరారు చేస్తున్న కొత్త నిబంధనల ప్రకారం విద్యార్థులు తమ యూనిఫాంతో పాటు జనివారం, తలపాగా, రుద్రాక్ష, శివధార, హిజాబ్, స్కార్ఫ్ వంటివి ధరించి తరగతులకు, పరీక్షలకు హాజరుకావచ్చు. విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో పాటు, విద్యార్థుల మత, సాంస్కృతిక పద్ధతులకు గౌరవం ఇచ్చేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ నిర్ణయంపై విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప మాట్లాడుతూ పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించినట్లు తెలిపారు. ఏప్రిల్ 24న ఒక విద్యార్థి జనివారాన్ని పరీక్ష హాలులో బలవంతంగా తీయించిన ఘటన తర్వాత దీనిపై చర్చ జరిగిందని ఆయన వివరించారు. "సంప్రదాయ, మతపరమైన ఆచారాల వల్ల పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు. అందుకే ఈ మార్గదర్శకాలు రూపొందించాం" అని ఆయన అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. 2022లో కొందరు ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించి తరగతులకు రావడంపై అభ్యంతరాలు రావడంతో అప్పటి బీజేపీ ప్రభుత్వం యూనిఫామ్ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత కర్ణాటక హైకోర్టు కూడా ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థిస్తూ, హిజాబ్ ఇస్లాంలో తప్పనిసరి మతపరమైన ఆచారం కాదని తీర్పు ఇచ్చింది.

# చట్టాన్ని ధిక్కరించే ధైర్యం ఆ కంపెనీలకు ఎలా వచ్చింది?

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఫీడ్ కంపెనీలతో ప్రభుత్వం కుమ్మక్కై, కమీషన్ల కోసం ఆక్వా రైతులను దారుణంగా దోచుకుంటోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పెంచిన ధరలను తక్షణమే పూర్తిగా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని జగన్ హెచ్చరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు ఆక్వా రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని జగన్ విమర్శించారు. "మీ పరిపాలనలో దోపిడీకి ఏ రంగమూ మినహాయింపు కాదు. చివరకు ఆక్వా ఫీడ్ ధరల విషయంలో కంపెనీలతో కుమ్మక్కై ఆక్వా రైతులను కూడా దోచుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. ఫీడ్ కంపెనీల యాజమాన్యాలు టీడీపీ సానుభూతిపరులని, కమీషన్ల కోసం వారితో చంద్రబాబు లాలూచీ పడ్డారని, అందుకే వారు అడ్డగోలుగా ధరలు పెంచుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులను సిండికేట్ల నుంచి, దళారుల బారి నుంచి కాపాడేందుకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి, ముఖ్యమంత్రి చైర్మన్‌గా 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ' (ఏపీఎస్ఏడీఏ)ని ఏర్పాటు చేశామని జగన్ గుర్తుచేశారు.

# ఢిల్లీలో మరో నిర్భయ

**- కదులుతున్న బస్సులో మహిళపై సామూహిక లైంగికదాడి**
**- డ్రైవర్, కండక్టర్ అరెస్ట్**
**- దేశ రాజధానిలో మహిళలకు భద్రత కరువు : మహిళా సంఘాలు**
**- బీజేపీ ప్రభుత్వంలో ప్రజలకు రక్షణేది? : ఆప్**

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

దేశ రాజధాని ఢిల్లీలో నిర్భయ తరహా ఘోరం వెలుగు చూసింది. కదులుతున్న ప్రయివేటు బస్సులో మహిళపై డ్రైవర్, కండక్టర్ సామూహిక లైంగికదాడికి తెగబడ్డారు. మే 12 (సోమవారం)న జరిగిన ఈ ఘటన బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వెలుగులో వచ్చింది. బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అరెస్ట్ చేసినట్టు పోలీసు వర్గాలు గురువారం వెల్లడించాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళకు రక్షణ కరువుతుంటే..దేశ రాజధానిలో ఇలాంటి కిరాతకాలు జరగటం పట్ల మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిర్భయ తరహా ఘటన పునరావృ తమైందని సీఎం రేఖాగుప్తా ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తీవ్ర విమర్శలు చేసింది. బీజేపీ ప్రభుత్వంలో ప్రజలకు భద్రత లేకుండా పోయిందని ఆగ్రహాన్ని వెలిబుచ్చింది.

**ఏం జరిగింది..?**

ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపిన వివరాలు ప్రకారం ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. పితాంపురా మురికి వాడ ప్రాంతంలో నివసిస్తున్న బాధితురాలు మంగోల్‌పురిలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా రాణిబాగ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. సరస్వతి విహార్‌లోని బీ-బ్లాక్ బస్టాండ్‌కు చేరుకున్న సమయంలో ఓ స్లీపర్ బస్సు అక్కడ ఆగింది. బస్సు తలుపు వద్ద నిలబడి ఉన్న వ్యక్తిని సమయం ఎంతైందని మహిళ అడిగింది. అయితే ఆ మహిళను ఆ వ్యక్తి బలవంతంగా బస్సులోకి లాగినట్టు పోలీసులు తెలిపారు.

**రెండు గంటల పాటు బస్సులోనే దారుణం**

ఆమెను లోపలికి లాగిన వెంటనే బస్సు తలుపులు మూసివేశారని బాధితురాలు ఫిర్యా దులో పేర్కొంది. అనంతరం బస్సు నాంగ్లో య్ మెట్రో స్టేషన్ సమీపంలో దాదాపు 7 కిలోమీటర్ల పరిధిలో రెండు గంటల పాటు తిరిగిందని వివరించింది. ఈ సమయంలో డ్రైవర్, కండక్టర్ కలిసి ఆమెపై లైంగికదాడికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. బస్సులో కర్టెన్లు ఉండటంతో బయటివారికి లోపల ఏమి జరుగుతోందో కనిపించలేదని పోలీసులు తెలిపారు. రాత్రి సుమారు 2 గంటల సమయంలో నిందితులు గాయాలపాలైన మహిళను బస్సు నుంచి బయటకు తోసేసి అక్కడి నుంచి పరారైనట్టు బాధితురాలు వివరించింది. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**బీహార్ రిజిస్ట్రేషన్ ఉన్న బస్సు స్వాధీనం**

బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా రాణిబాగ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 64(1) (లైంగికదాడి), 70(1) (సామూహిక లైంగికదాడి), 3(5) (ఉమ్మడి ఉద్దేశం) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. ఉమేశ్, రాజేంద్రగా గుర్తించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్టు వెల్లడించాయి. నేరానికి ఉపయోగించిన బీహార్ రిజిస్ట్రేషన్ నంబర్ ఉన్న బస్సును స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపించినట్టు తెలిపాయి. ఈ కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నట్టు ఢిల్లీ పోలీసులు చెప్పారు.అలాగే బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు అధికారులు వెల్లడించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆస్పత్రిలో చేరాలని వైద్యులు సూచించినప్పటికీ బాధితురాలు నిరాకరించినట్టు వెల్లడించారు. తన భర్త క్షయవ్యాధితో బాధపడుతున్నారని, పిల్లలను చూసుకోవాల్సిన బాధ్యత ఉందని ఆమె పోలీసులకు చెప్పినట్టు సమాచారం. అందువల్ల ఇంటి వద్ద నుంచే చికిత్స కొనసాగించేందుకు నిర్ణయించుకు న్నట్టు తెలిసింది.

**మళ్లీ నిర్భయ ఘటన**

ఈ ఘటనపై ప్రతిపక్ష? ఆప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది దేశానికి పెద్ద అవమానం అంటూ బీజేపీపై ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ విమర్శలు గుప్పించారు. "పెద్ద అవమానం. నిర్భయ ఘటన మళ్లీ జరిగింది. 30 ఏండ్ల మహిళను రాత్రి సమయంలో బస్సులోకి ఎక్కించి దారుణానికి పాల్పడ్డారు" అని సౌరభ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# మూడో దశ 'సర్' షెడ్యూల్ విడుదల

**- తెలంగాణ, ఏపీతో పాటు 16 రాష్ట్రాలు, ?**
**- మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రక్రియ**

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

మూడో దశ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. తెలంగాణ, ఏపీతో పాటు 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత పాంత్రాల్లో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపింది. ఈ మేరకు గురువారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. మొత్తం ఎనిమిది విడతల్లో ఈ మూడో దశ 'ఎస్ఐఆర్'ను నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఏపీతో పాటు ఒడిశా, మిజోరాం, సిక్కిం, మణిపూర్, దాద్రానగర్ హవేలీ, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, పంజాబ్, కర్నాటక, మహారాష్ట్ర, జార్ఖండ్, మేఘాలయ, ఢిల్లీ, నాగాలాండ్, త్రిపుర ఉన్నాయి. ఇందుకోసం 3.92 లక్షల మందికిపైగా బూత్ స్థాయి అధికారులు (బీఎలఓలు) 36.73 కోట్ల మంది ఓటర్ల వద్దకు వెళ్లనున్నారు. వీరికి లెక్కింపు దశలో రాజకీయ పార్టీలచే నియమించబడిన మరో 3.42 లక్షల బూత్ లెవల్ ఏజెంట్లు(బీఎలఏలు) సహాయంగా నిలవనున్నారు. అయితే ఈ ప్రక్రియకు సహకరిస్తూ... తమ పార్టీల నుంచి బీఎలఏలను నియమించాలని రాజకీయ పార్టీలను ఈసీ కోరింది. తొలి రెండు దశల్లో 13 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో జరిగిన సర్ ప్రక్రియలో దాదాపు 59 కోట్ల మంది ఓటర్లను చేరినట్టు వెల్లడించింది. ఈ ప్రక్రియ కోసం 9.2 లక్షలకుపైగా బీఎలఏలు పలు రాజకీయ పార్టీల నుంచి పాలుపంచుకున్నట్టు తెలిపింది. కాగా దేశవ్యాప్త జనగణనలో ఇండ్ల జాబితా ప్రక్రియ, యంత్రాంగాన్ని దఅష్టిలో పెట్టుకొని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లధక్‌లకు ఈ మూడో దశ నుంచి మినహాయింపు ఇచ్చినట్టు పేర్కొంది. ఈ మూడు రాష్ట్రాలు/యూటీల్లో స్థానికంగా ఉండే చల్లని వాతావరణం, ఎత్తైన ప్రాంతాలను దఅష్టిలో పెట్టుకొని సర్ షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలిపింది.

**తెలంగాణ, పంజాబ్‌లో ఒకేసారి 'సర్' ప్రారంభం**

తెలంగాణతో పాటు పంజాబ్‌లో ఒకేసారి ఈ ఎసఐఆర్ ప్రకియ ప్రారంభించనున్నట్టు ఈసీ వెల్లడించింది. ప్రస్తుతం తెలంగాణలో మే12 నాటికి 3,39,20,705 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపింది. వీరిని చేరేందుకు 35,985 మంది బీఎలఓలు, 25,886 మంది బీఎలఏల సహాయం తీసుకోనున్నట్టు పేర్కొంది. కాగా ఈ సిబ్బందికి జూన్ 15 నుంచి 24 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటి సర్వే చేపడతారు. ఆ తరువాత జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించి, అదే రోజు నుంచి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. చివరగా అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ఈసీ ప్రకటించనుంది.

చివరగా సెప్టెంబర్‌లో త్రిపురలో ఈ ప్రక్రియ ప్రారంభం కానుండగా డిసెంబర్ 12న ప్రకటించబోయే ఆ రాష్ట్ర తుది ఓటర్ల జాబితా ప్రచురణతో మూడో దశ సర్ ప్రక్రియ ముగియనుంది.ఇక ఆంధ్రప్రదేశ్‌తో పాటు హర్యానా, చండీగడ్, అరుణాచల్ ప్రదేశ్‌లో ఒకేసారి ఎసఐఆర్ ప్రక్రియ జరగనుంది. ఏపీలో మొత్తం 4,16,16,061(ఈ నెల 12 వరకు) మంది ఓటర్లు ఉన్నట్టు వెల్లడించింది.

వీరిని చేరేందుకు 46,397 మంది బీఎలఓలు, 68,868 బీఎలఏల సహకారం తీసుకోనుంది. జూన్ 5 నుంచి 14 వరకు సిబ్బందికి శిక్షణ, అదే నెల 15 నుంచి జులై14 వరకు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. అనంతరం జులై 21న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను ఈసీ వెల్లడిస్తుంది.

# సంక్షోభాల నివారణలో బ్రిక్స్ నిర్మాణాత్మక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

**కొత్త సవాళ్లతో అనేక దేశాల ఆందోళన**

ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు సవాళ్లతో పాటు అంచనాలనూ సృష్టిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. ఇంధన భద్రత, ఆహార భద్రత, ఎరువుల లభ్యత, ఆరోగ్య వ్యవస్థలు, ఆర్థిక సహాయం పొందడం వంటి విభాగాల్లో ఏర్పడిన కొత్త సవాళ్లతో అనేక దేశాలు ఆందోళనకు గురవుతున్నాయని ఆయన చెప్పారు. బ్రిక్స్ కూటమి దేశాల ఆర్థిక వృద్ధి కొనసాగాలంటే సరఫరా గొలుసుల్లో స్థిరత్వం, మార్కెట్ల వైవిధ్యీకరణ అనే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రపంచ రాజకీయ అస్థిరతలు, వాణిజ్య అంతరాయాలతో ఏర్పడుతున్న పర్యవసానాలను మరింత మెరుగ్గా ఎదుర్కొనేందుకు ఆచరణాత్మక మార్గాలను బ్రిక్స్ దేశాలు కనుగొనాలని ఆయన కోరారు. ఇప్పుడు సైనిక సంఘర్షణలకు పాల్పడుతున్న దేశాలు, శాంతి చర్చలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని జైశంకర్ అన్నారు. ఇదే సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై బ్రిక్స్ దేశాలు అన్నింటికీ అమితమైన ఆసక్తి ఉందన్నారు. ఉగ్రవాదంపై బ్రిక్స్ కూటమి ఉమ్మడి పోరు జరపాలన్నారు. వాతావరణ మార్పులు యావత్ ప్రపంచ దేశాలను ఆందోళనకు గురి చేస్తున్నాయని, వాతావరణ మార్పులపై బ్రిక్స్ దేశాల చర్చలు సమానత్వం, విభిన్నమైన బాధ్యతలను కలిగిన ఉమ్మడి సూత్రాలను సమర్థించే దిశగా జరగాలని కోరారు.

అలాగే బ్రిక్స్ కూటమి పురోగతికి సంస్థాగతమైన సంస్కరణలు అత్యవసరమని, అధ్యక్ష హోదాలో దీనిపై భాగస్వామ్య దేశాలతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు.

**ఇరాన్, యుఎఇ, చైనా ప్రతినిధులకు స్వాగతం**

అంతకుముందు, గురువారం ఉదయం ఢిల్లీలోని భారత్ మండపంలో బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు, పరిశీలక దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులకు జైశంకర్ స్వాగతం పలికారు. ఇండోనేషియా (సుగియోనో), దక్షిణాఫ్రికా(రొనాల్డ్ లామోలా), ఇథియోపియా (గెడియన్ తిమోతి హెస్సెబోన్), రష్యా (సెర్గీ లవ్రోవ్), బ్రెజిల్ (మౌరో వియేరా), ఇరాన్ (సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(ఖలీఫా షాహీన్ అల్ మరార్- సహాయ మంత్రి) దేశాల విదేశాంగ మంత్రులను జైశంకర్ ఆహ్వానించారు.

ప్రస్తుతం అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటనలో ఉండటంతో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీకి బదులుగా భారత్‌లోని చైనా రాయబారి జు ఫీహాంగ్ ఈ సదస్సుకు హాజరయ్యారు. కాగా ఈ నెల 15న శుక్రవారం కూడా వరకు బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సదస్సు కొనసాగుతుంది. 2012, 2016, 2021లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు భారత్ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సంవత్సరం జనవరి 1న బ్రెజిల్ నుంచి బ్రిక్స్ అధ్యక్ష పదవిని అధికారికంగా చేపట్టింది. ఈ కీలకమైన కూటమికి భారత్ అధ్యక్షత వహించడం ఇది నాలుగోసారి.

**పాలస్తీనా సమస్యకు రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం..**

పాలస్తీనా సమస్య పరిష్కారానికి రెండు దేశాల ఏర్పాటే మార్గమని భారత్ పునరుద్ఘాటించింది. రెండు దేశాల ఏర్పాటుకే తమ మద్దతు ఉంటుందని పేర్కొంది. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యవస్థకు శాంతిభద్రతలే కీలకమన్నారు. చర్చలు, దౌత్యం ప్రాముఖ్యతను ఇటీవల చెలరేగుతున్న సంఘర్షణలు చాటిచెబుతున్నాయన్నారు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో విభిన్న బాధ్యతలను గుర్తించుకుంటూనే చర్చలతో సుస్థిర అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళ్లాలని సూచించారు. సాంకేతిక రంగంలో పురోగతులు ప్రపంచ స్వరూపాన్ని మారుస్తున్నాయని, సుపరిపాలన, సమ్మిళిత వృద్ధి కోసం వాటిని ఉపయోగించుకోవచ్చని ఆయన చెప్పారు. ఇజ్రాయిల్-పాలస్తీనా సమస్యపై మాట్లాడుతూ "పాలస్తీనా సమస్య విషయంలో రెండు దేశాల ఏర్పాటుకే భారత్ మద్దతు ఇస్తుంది" అని స్పష్టం చేశారు. అలాగే, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా సముద్ర రవాణాకు ముప్పు, ఇంధన సరఫరాకు అంతరాయం కలగడంపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**బ్రిక్స్ మంత్రులతో మోడీ భేటీ**

న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరైన మంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గురువారం భేటీ అయ్యారు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చీ, దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి రోనాల్డ్ లామోలా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరా, ఇతరులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కలిశారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో భాగంగా ఈ భేటీలు జరిగాయి. అనంతరం సదస్సుకు హాజరైన ప్రతినిధులతో ఆయన ఫొటోలు దిగారు.

## 'నా దేశం - నా బాధ్యత' పేరిట
# పొదుపు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాల విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. బంగారం కొనుగోళ్లు తగ్గించేలా ప్రజలను చైతన్యం చేయాలని, విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని, సౌర విద్యుత్ విధానాన్ని కూడా పెద్ద ఎత్తున అందిపుచ్చుకునేలా చూడాలని అన్నారు. ఎప్పటికప్పుడు అవసరాన్ని బట్టి మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందిస్తూ పొదుపు చర్యలు ఒక్కసారిగా ప్రజల్ని భయపెట్టేలా ఉండకూడదని, దశల వారీగా చేపడదామని సూచించారు. ఈ సూచనకు సిఎం కూడా సానుకూలంగా స్పందించారు. ప్రతి నిర్ణయాన్ని 48 గంటల ముందుగానే చెప్పి, ప్రజలను సన్నద్ధం చేద్దామని సిఎం చెప్పారు. వివిధ శాఖల పరిధిలో పొదుపు చర్యలు, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాలపై అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందించాలని, సంబంధిత శాఖల కార్యదర్శులు ఈ అంశంపై దృష్టి సారించేలా చూడాలని అన్నారు. ఈ అంశాలపై అవసరమైతే ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేద్దామన్నారు. దేశాన్ని కాపాడేందుకు ప్రస్తుతం పొదుపు చర్యలు చాలా అవసరమని, ఈ విషయాన్నే ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని చెప్పారు. సంక్షోభాలు ఎదుర్కోవడం కొత్త కాదని, వాటిని సక్రమంగా అధిగమించటమే కీలకమని సిఎం అన్నారు

**కార్యదర్శులపై సీరియస్**

అంతకుముందు మంత్రివర్గ సమావేశంలో కార్యదర్శులు సకాలంలో రాకపోవడంపై సిఎం సీరియస్ అయినట్లు సమాచారం. పొదుపు చర్యలపై చర్చను మొదటి అజెండాగా చేర్చినా కొందరు అధికారులు రాకపోవడంపై ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రశ్నించారు. సమయానికి రాని అధికారుల నుంచి వివరణ తీసుకుని సీరియస్ యాక్షన్ తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది.

**అగ్రిగోల్డ్ బాధితులకు ఆరునెలల్లో న్యాయం**

అగ్రిగోల్డ్ బాధితులకు ఆరు నెలల్లో న్యాయం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. దీనికోసం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మన రాష్ట్రంలోనే 11.5 లక్షల మందికిపైగా బాధితులున్నారని, ఇతర రాష్ట్రాలలో కలుపుకుంటే వీరి సంఖ్య 20 లక్షల మందికి చేరుతుందని సిఎం చెప్పారు.

**మహానాడుపై చర్చ**

ఈ నెలాఖరులో నిర్వహించే మహానాడు కార్యక్రమంపై మంత్రి నారా లోకేష్ వద్ద బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో చర్చ జరిగింది. ఒకవైపు పొదుపుపై మాట్లాడుతూ ఇంకోవైపు భారీ వ్యయంతో మహాసభ నిర్వహిస్తే బాగుండదన్న అభిప్రాయాన్ని కొందరు మంత్రులు ఈ సందర్భంగా చెప్పారు. బహిరంగసభ లేకుండానే మహానాడు నిర్వహిస్తే బాగుంటుందని కొందరు సూచించినట్లు సమాచారం. దీనిపై ముఖ్యమంత్రితో మాట్లాడి తుది నిర్ణయం తీసుకుందామని లోకేష్ చెప్పారు.

## 'నీట్' రద్దు...మోడీ సర్కార్
# ఫెయిల్యూరే

**హైదరాబాద్– సూర్య వాస్తవం :**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వైఫల్యం వల్లే నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు అయ్యిందని సీఎం ఏ రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ ఏకపక్ష రద్దు నిర్ణయం యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు చేశారు. గడచిన పదేండ్లలో ప్రధాని మోడీ హయాంలో 93 పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆక్షే?పించారు. నీట్ పరీక్షరద్దు నిర్ణయం దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందనీ, ఇది కూడా పెద్ద నోట్ల రద్దు వంటిదేనని విమర్శించారు. పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు వ్యవస్థీకృతం కావడం దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెడుతున్నాయని పేర్కొన్నారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమ పిల్లలను నీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారనీ, వారి ఆశలన్నీ గల్లంతవడం బాధాకరమన్నారు. 2019 నుంచి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయని గుర్తుచేశారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన "ది పేపర్ లీక్ డెకేడ్" శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షల్లో 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయన్నారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్–యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి–నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్–నెట్, నీట్–పిజి రద్దు అయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్ రద్దు నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని భరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

# నీట్' పరీక్షను ఎత్తేయండి

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం, పరీక్ష రద్దు వంటివి.. వ్యవస్థాగత లోపాలకు నిదర్శనమని ప్రకటనలో పేర్కొన్నారు. నీట్ దుర్వినియోగం కావడం ఇదే మొదటిసారి కాదని తెలిపారు. మొదటినుంచి నీట్ను తమిళనాడు వ్యతిరేకించిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ పరీక్షతో గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, తమిళ మాధ్యమానికి చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. 12వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి విజయ్ విజ్ఞప్తి చేశారు. '2024లో నీట్ ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో ఆరు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్లు నమోదు చేసి సిబిఐకి బదిలీ చేశారు. అలాగే, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కె రాధాకృష్ణన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ సంస్కరణల కోసం 95 సమగ్ర సిఫార్సులను సమర్పించింది. ఇవన్నీ జరిగినప్పటికీ, రెండేళ్లలోపే మళ్లీ మరో నీట్ పేపర్ లీక్ అవ్వడంతో పరీక్షను రద్దు చేశారు' అని ఆ ప్రకటనలో విజయ్ పేర్కొన్నారు. 'ఇది జాతీయ స్థాయి పరీక్షలో ఉన్న నిర్మాణాత్మక లోపాలకు రుజువు" అని ప్రకటనలో విజయ్ విమర్శించారు.

## ఆంధ్రప్రదేశ్ అంతటా
# వేగంగా విస్తరిస్తున్న ముళ్ల కంప

**- పర్యావరణానికి అనర్థదాయకం**
**- డా. ముచ్చుకోట సురేష్ బాబు**



**అనంతపురం – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్‌లో విస్తారమైన భూభాగాలు వేగంగా విస్తరిస్తున్న ఆక్రమణ కారి జాతి ప్రోసోపిస్ జులిఫ్లోరా చేత క్రమంగా ఆక్రమించబడుతున్నాయి. ఈ ముళ్లతో నిండిన దట్ట మైన పొదలు ప్రస్తుతం పర్యావరణానికి, గ్రామీణ జీవనాధారాలకు తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. ప్రభావిత ప్రాంతాల్లో నిర్వహించిన క్షేత్ర పరిశీలనలు, దృశ్య ఆధారాలు ఈ మొక్కలు దట్టమైన, దాటలేనంతగా పెరిగిన పొదలుగా విస్తరించాయని వెల్లడిస్తున్నాయి. సాధారణంగా "విలాయతి బాబుల్" లేదా "సీమ కరువేలం"గా పిలిచే ఈ మొక్కలు పదునైన ముళ్ళు, సన్నని ఆకులు, బీన్స్ ఆకారపు కాయలతో ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఎండ అర్ధ ఎండ ప్రాంతాల్లో ఇవి ఒకే రకంగా వేగంగా వ్యాపించడం పర్యావరణ సమతౌల్యానికి ప్రమాదకర సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.సున్నిత ప్రాంతాల్లో దూకుడైన విస్తరణరాయలసీమ జిల్లాలో అనంతపురం, కర్నూలుతో పాటు తీర ఆంధ్రాలో పాడుబడ్డ భూములు, గనుల ప్రాంతాలు, కాలువ గట్టుల వరకు ఈ మొక్క విస్తరించింది. కడప జిల్లా మంగంపేటలో గనుల వ్యర్థ ప్రాంతాలను ఇది పూర్తిగా ఆక్రమించడం కాకుండా, నేలలోని భారీ లోహాలను కూడా శోషించగల సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది.పర్యావరణవేత్తల ప్రకారం, కరువు పరిస్థితులు పశువుల సంచారం ఈ మొక్కల వ్యాప్తిని మరింత వేగవంతం చేస్తున్నాయి. పశువులు తెలియకుండానే విత్తనాలను వ్యాపింపజేస్తున్నాయి. కృష్ణా, గుంటూరు వంటి తీర ప్రాంతాల్లో నదీ ప్రవాహాలు, సాగు కాలువలు కూడా ఈ మొక్క కొత్త ప్రాంతాలకు చేరేందుకు సహకరిస్తున్నాయి.

**పర్యావరణం వ్యవసాయంపై ప్రభావం**

మొదట ఎడారీకరణను అరికట్టేందుకు ప్రవేశపెట్టిన ప్రోసోపిస్ జులిఫ్లోరా ఇప్పుడు ప్రధాన పర్యావరణ ముప్పుగా మారింది. దీని ప్రభావాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి:\ జీవ వైవిధ్యం నష్టం: దట్టమైన ఏకజాతి పొదలు స్థానిక మొక్కలను అణచివేసి, వన్యప్రాణుల నివాసాలను తగ్గిస్తున్నాయి.

- **భూగర్భ జలాల తగ్గుదల:** లోతైన వేర్లు అధిక పరిమాణంలో భూగర్భ జలాలను పీల్చి నీటి కొరతను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.
- **భూమి నాశనం:** సాగు మేత భూములు పనికిరాకుండా మారుతున్నాయి.
- **పశువులకు ప్రమాదం:** ముళ్ల వల్ల గాయాలు కావడం, కాయలను అధికంగా తినడం వల్ల జీర్ణ, దంత సమస్యలు తలెత్తుతున్నాయి.



రైతుల అభిప్రాయం ప్రకారం, ఈ మొక్క ఒకసారి స్థిరపడితే భూమిని తిరిగి సాగుకు అనుకూలంగా మార్చడం చాలా ఖర్చుతో కూడుకున్నది శ్రమాధారిత ప్రక్రియగా మారుతోంది. ఇది గ్రామీణ జీవనాధారాలపై నేరుగా ప్రభావం చూపుతోంది. నియంత్రణ చర్యలకు సవాళ్లుఈ మొక్కల వ్యాప్తిని అరికట్టేందుకు చేపట్టిన చర్యలు మిశ్రమ ఫలితాలను ఇస్తున్నాయి. ఒక్క విధానం సరిపోదని, సమగ్ర వ్యూహం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. వేరులతో సహా పూర్తిగా తొలగించడం అత్యంత ప్రభావవంత మైన పద్ధతిగా భావిస్తున్నప్పటికీ, ఇది అధిక శ్రమను కోరుతుంది. కేవలం కత్తిరించడం వల్ల మొక్కలు మళ్లీ వేగంగా పెరుగుతున్నాయి. గ్లైఫోసేట్ వంటి కలుపు మందులను కత్తిరించిన వెంటనే ఉపయో గించడం కొంతవరకు ఫలితాలనిస్తున్నప్పటికీ, జాగ్రత్తగా వినియోగించకపోతే పర్యావరణ ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉంది. విత్తనాలు తినే కీటకాలను ఉపయోగించే జీవ నియంత్రణ పద్ధతులను కూడా పరిశీలిస్తున్నప్పటికీ, వాటి ప్రభావం ప్రస్తుతం పరిమితంగానే ఉంది.

**సమగ్ర విధానం అత్యవసరం**

ప్రజాసైన్స్ వేదిక ప్రధాన కార్యదర్శి షేక్ బాబా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో విజయవంతమైన చర్యలు సమగ్ర వ్యూహం అవసరాన్ని స్పష్టంగా చూపుతున్నాయని తెలిపారు. ఈ విధానంలో వేర్ల స్థాయిలో తొలగింపు, తిరిగి పెరుగుతున్న మొక్కలపై నియంత్రిత కలుపు మందుల వినియోగం, బయోమాస్‌ను బొగ్గు ఇంధనంగా వినియోగించడం, అలాగే స్థానిక గడ్డి మరియు చెట్లను మళ్లీ నాటడం వంటి చర్యలు ఉంటాయి. రాయల సీమ ప్రకాశం జిల్లాల్లో ప్రజల భాగ స్వామ్యంతో చేపట్టిన కార్యక్రమాలు తాత్కాలిక ఉపశమనం అందించినప్పటికీ, దీర్ఘకాల విజయానికి నిరంతర పర్యవేక్షణ పర్యావరణ పునరుద్ధరణ కీలకమని వెల్లడించాయి. ప్రతికూల ప్రభావాలు ఉన్నప్పటికీ, ప్రోసోపిస్ జులిఫ్లోరా కొంత ఆర్థిక ప్రయోజనం కూడా కలిగిస్తోంది. ముఖ్యంగా ఇంధన కలప చిన్నస్థాయి బొగ్గు తయారీలో ఉపయోగపడుతోంది. అయితే శాస్త్రవేత్తల ప్రకారం, ఈ తాత్కాలిక లాభాలు దీర్ఘకాల పర్యావరణ నష్టాల ముందు చాలా చిన్నవే. ఈ సమస్యపై పౌర స్పందన వేదిక నాయకులు ప్రొ గంగంపల్లి వెంకట శివారెడ్డి స్పందిస్తూ ఈ ఆక్రమణకారి మొక్కల వేగవంతమైన విస్తరణను అరికట్టేందుకు ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, స్థానిక సమాజాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జల సంరక్షణ, వ్యవసాయ భూముల రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# బ్రహ్మంగారిమఠాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పరుస్తా

**- మైదుకూరు ఎమ్మెల్యే**
**పుట్టా సుధాకర్ యాదవ్**



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పరుస్తానని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.గురువారం ఆయన మండల కేంద్రంలోని జింకలనగర్ లో రామాలయానికి భూమి పూజ చేశారు.టీటీడీ వారి 20 లక్షల నిధులతో ఈ రామాలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. అలాగే సాయిబాబా గుడి కాలనీలో గత 13 ఏండ్ల క్రితం అప్పటి పాలకులు కోటి రూపాయల నిధులతో నీళ్ల ట్యాంకు నిర్మించి కేవలం రెండు లక్షల గల పనులను చేయలేక నిరుపయోగంగా ఇప్పటివరకు ఉందని ఆయన విమర్శించారు. ఈ విషయం స్థానిక మా నాయకులు నా దృష్టికి తేవడంతో వెంటనే బోరు,మోటారు వేసి ఈరోజు ప్రారంభించడం నాకెంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయన ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని జింకల నగర్ లోని ఎస్సీ కాలనీలోమినరల్ వాటర్ కోసం అన్ని బిగించుకొని కేవలం 60,70 వేల రూపాయలు లేక ప్లాంట్ అంతా నిరుపయోగంగా ఉందని స్థానిక నాయకుడు శ్రీనివాసుల రెడ్డి తెలపడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్లాంటును పరిశీలించి స్థానిక ఎంపీడీవోకు వెంటనే నిధులను మంజూరు చేయాలని ఆదేశించడం జరిగింది.అలాగే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గుడికి ప్రసాదం స్కీం కింద 162 కోట్లు మంజూరు అయిందని,దీంతో బ్రహ్మంగారి మఠశీ రూపు రేఖలు మారిపోతాయన్నారు.దీనికి స్థానిక మా నాయకులందరూ కూడా కలిసికట్టుగా ఉండి సహకరించాలని,వారందరితో కూడా నేను కలిసి మాట్లాడతానని ఆయన అన్నారు. అందరూ కూర్చొని సమావేశమై మఠం అభివృద్ధికి ఏమేమి చర్యలు తీసుకోవాలి ఎలా చేయాలి అనేదానిపై కూలంకుశంగా అందరితో చర్చిస్తామన్నారు. అలాగే మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాం తమయ్యాయని ఒక నెలలో వాటికి పరిష్కార మార్గం చూపుతామన్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించిన తర్వాత ఎవరైతే భూమిలేని వారు ఉన్నారో వారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో పట్టాలు ఇప్పించే ప్రయత్నం చేస్తానన్నారు.ఎవరికైనా చేయాలనే తపన ఉంటే ఏమైనా సాధించవచ్చుని,అలా కాకుండా ఏమి పట్టించుకోకపోతే పనులు కూడా అలాగే నిలబడిపోతాయన్నారు. మండలంలో ఇంకా అభివృద్ధి పనుల కొరకు ఎంతో ప్రయత్నం చేస్తున్నానని,కేంద్రం నుంచి నిధులను తెప్పించి నవోదయ పాఠశాలను పూర్తి చేస్తానన్నారు.అలాగే స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్స్ తో వివరాలన్నీ తెలుసుకున్నారు. రెగ్యులర్ స్టాఫ్ నర్స్ లు లేరని చెప్పడంతో వెంటనే జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. అవసరమైతే కలెక్టర్ తో మాట్లాడి రెగ్యులర్ స్టాఫ్ నర్స్ లను నియమించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి,మండల టిడిపి అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి, తెలుగుదేశం మండల నాయకుడు పూజా శివయ్య యాదవ్ ఎంపీడీవో రామచంద్రారెడ్డి,పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు,టిడిపి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# దేశ ఆర్థిక వైఫల్యాలను
# ప్రజలపై రుద్దుతున్న కేంద్ర ప్రభుత్వం

- దేశంలో ఆర్థిక సంక్షోభం రాబోతుంది
- నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి



**డోన్ – సూర్య వాస్తవం:** దేశ ప్రజల సంపదను రక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ప్రజలకు "బంగారం కొనవద్దు" అనే సూచనలు ఇవ్వడం ఆర్థిక వ్యవస్థ ఎంత తీవ్రమైన సంక్షోభంలో ఉందో వెల్లడిస్తోందని, నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి ఒక ప్రకటనలో విమర్శించారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇటీవలి చేసిన వ్యాఖ్యలు దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రజల్లో మరింత ఆందోళన కలిగిస్తున్నాయని వారు పేర్కొన్నారు. భారతదేశంలో బంగారం కేవలం ఒక లోహం కాదు – అది భారత కుటుంబాల భద్రత, మహిళల ఆర్థిక స్వావలంబన, గ్రామీణ సమాజాల నమ్మకం, తరతరాల పొదుపు సంస్కృతి. అలాంటి బంగారం కొనుగోళ్లను నిరుత్సాహపరచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక వైఫల్యాలను ప్రజలపై మోపే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో నెలకొన్న పరిస్థితులను వారు ఈ విధంగా ఎండగట్టారు. రూపాయి విలువ నిరంతరం పడిపోవడం,నిరుద్యోగం గరిష్ట స్థాయికి చేరడం, ద్రవ్యోల్బణం సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను దెబ్బతీయడం, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటడం, మధ్యతరగతి, పేద ప్రజల పొదుపులు క్షీణించడం. ఈ పరిస్థితులకు కారణం ప్రజలు బంగారం కొనడం కాదు; ప్రభుత్వ సరైన ఆర్థిక విధానాల లోపం, పెరుగుతున్న దిగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థ, మరియు కార్పొరేట్ అనుకూల విధానాలే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. భారతీయ మహిళల "బంగారం" అనేది కేవలం అలంకారం కాదు – అది కుటుంబ భరోసా, అత్యవసర సమయంలో ఆర్థిక రక్షణ అని, ఈ వాస్తవాన్ని విస్మరించి మాట్లాడటం బాధ్యతారాహిత్యమని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజల పొదుపులపై వ్యాఖ్యానించడానికి ముందు పెరుగుతున్న నిరుద్యోగంపై, అప్పులపై, మరియు రూపాయి పతనాన్ని ఆపే చర్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం అంటే ప్రజల ఎంపికలను తప్పుబట్టడం కాదు; ప్రజల ఆదాయాలను, కొనుగోలు శక్తిని, భవిష్యత్ భద్రతను పెంచడమని హితవు పలికారు. ఈ కార్యక్రమములో డిసిసి ఉపాధ్యక్షులు న్యాయవాదులు ఉన్నిగొర్ల జనార్దన్, డిసిసి ప్రధాన కార్యదర్శి వడ్డే రాజశేఖర్, మరియు డిసిసి సెక్రటరీ మధు సూదన్ రెడ్డి, డోన్ మండల అధ్యక్షులు పఠాన్ మహమ్మద్ హుస్సేన్, డోన్ పట్టణ అధ్యక్షులు వై. శేఖర్,సీనియర్ నాయకులు గిడ్డయ్య, జలదుర్గం నాయుడు,మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరించిన కమాండెంట్ ప్రభు కుమార్



**నార్పల – సూర్య వాస్తవం :** జంతలూరులోని 14వ బెటాలియన్ పోలీస్ సిబ్బంది పిల్లలు సాధించిన ఈ విజయం నిజంగా అభినందనీయం. 10వ తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించడం వారి కష్టానికి, క్రమశిక్షణకు నిదర్శనం. ఈ కార్యక్రమంలో 14వ బెటాలియన్ కమాండెంట్ ప్రభు కుమార్ విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. విజేతలైన 18 మంది విద్యార్థులకు మెమెంటోలు, భవిష్యత్తు చదువులకు ఉపయోగపడే విధంగా ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను బహుకరించారు. కఠినమైన విధుల్లో ఉండే పోలీస్ సిబ్బంది పిల్లలు ఇలాంటి ఉన్నత శిఖరాలను అధిరో హించడం ఆయా కుటుంబాల్లో ఎంతో స్ఫూర్తిని, సంతోషాన్ని నింపింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పిల్లల పట్టుదల తోడైతే ఎలాంటి ఫలితాలనైనా సాధించవచ్చని ఈ విద్యార్థులు నిరూపించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులుతో పాటు వారి తల్లిదండ్రులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మట్కా స్థావరంపై పోలీసుల దాడి

- ఐదుగురి అరెస్ట్ - రూ. 25 వేలు నగదు స్వాధీనం



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, గుంతకల్ డిఎస్పి ఏ.శ్రీనివాస్ పర్యవేక్షణలో మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల నివారణలో భాగంగా ఈరోజు గుత్తి పట్ట ణంలో మట్కా స్థావరాన్ని సి.ఐ రామారావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకొన్నారు. ఆకస్మిక దాడి గుత్తి టౌన్ పరిధిలోని అమృత టాకీస్ వె నుక వైపు ఉన్న ఎస్సీ కాలనీలో బ హిరంగంగా మట్కా నిర్వహిస్తున్న ట్లు పోలీసులకు ముందస్తు సమా చారం అందింది.దీనిపై స్పందించిన గుత్తి సీఐ రామారావు తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు. అరెస్టులు మరియు స్వాధీనం ఎ స్సీ కాలనీలోని పురుషోత్తం ఇంటి వద్ద మట్కా రాస్తున్న ఈ క్రింది ఐదుగు రిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పురుషోత్తం, మస్తానమ్మ, సునీత, నాగేశ్వరి, చౌడమ్మ, రికవరీ కేసు నమోదు నిందితుల వద్ద నుండి రూ. 25,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. మట్కా నిర్వహణకు ఉపయోగిస్తున్న మట్కా చిట్టీలను, ఇతర సామగ్రిని సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేశారు. పట్టణంలో ఎవరైనా మట్కా, జూదం లేదా ఇతర చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీఐ రామారావు కోరారు.

## ఆరోగ్య శిబిరానికి గ్రామస్తుల విశేష స్పందన

- 40 మందికి ఐదు రకాల రక్త పరీక్షలు
- హెచ్ఐవిపై అవగాహన కల్పించిన వైద్యులు, వైద్య సిబ్బంది



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు, జిల్లా ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి శైలజ మేడం సూచనలతో గురువారం పెళ్లకూరు మండలం పాలచూరు గ్రామపంచాయతీలో సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని మొబైల్ ఐసిటిసి సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత మేడం పర్యవేక్షణలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఎం.ఎల్.హెచ్.పి, ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందజేశారు. శిబిరంలో పాలచూరు గ్రామానికి చెందిన సుమారు 40 మందికి ఐదు రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా హెచ్ఐవి, రక్తహీనత, షుగర్, ఇతర అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తూ జాగ్రత్తలు వివరించారు. అలాగే ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా తరచూ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయడం, ఎయిడ్స్ మరియు టీబీ వంటి వ్యాధులపై ముందస్తు అవగాహన కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజలు మంచి స్పందన వ్యక్తం చేశారు.

**ఆరోగ్యమే మహాభాగ్యం -- గ్రామస్థులకు వైద్యుల సూచనలు**

వైద్య సిబ్బంది ప్రజలకు పరిశుభ్రత, సురక్షిత జీవన విధానం, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఇటువంటి ఆరోగ్య శిబిరాలు తరచూ నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

# కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డిని
# పరామర్శించిన కాకాణి, సంజీవయ్య

- వైసీపీ నేతలపై కక్షసాధింపు రాజకీయాలు
: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి
- రాజకీయ వేధింపులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు : కిలివేటి సంజీవయ్య



**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న మాజీ ఎన్‌డీసీసీబీ ఛైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డిని వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆరోగ్య పరిస్థితి, జైలు పరిస్థితులు తదితర అంశాలపై వారు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి రాష్ట్రంలో టీడీపీ పాలనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు రాజకీయాలు కొన సాగుతున్నాయని తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాజకీయ ప్రతీకార ధోరణితోనే వైసీపీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరో పించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ వేధింపులకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం భయాందోళనల రాజకీయాలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను బెదిరించి మానసికంగా ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి రాజకీయ వేధింపులకు ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను లక్ష్యంగా చేసుకుని కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని, వైసీపీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 19న జరిగే మహానాడును విజయవంతం చేద్దాం

- వై.నాగేశ్వరరావు యాదవ్ డిసిఎంఎస్ ఛైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు



**ప్యాపిలి – సూర్య వాస్తవం :** ప్యాపిలి పట్టణం టీడీపీ కార్యలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నాగేంద్ర, రామ్మోహన్ యాదవ్, గండికోట రామాంజనేయులు, ఓబులేష్, ఎరుకల పరమేశ్వరుడు, మహేష్ యాదవ్, శ్రీరాములు, మసాలా రామచంద్రుడు, నరేష్ తదితర టీడీపీ నాయకులు మొదలైన వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పేదలపార్టీ, పేదల సంక్షేమ ధ్యేయంగా సూపర్ సిక్స్ పథకాలైన ఎన్టీఆర్ భరోసా పింఛను, అన్నా క్యాంటిన్, మెగా డీఎస్సీ దీపం పథకం, స్త్రీ శక్తి పథకం, అన్నదాత సుఖీభవ పథకాలు విజయవంతం చేశారు. బీసీలకు రక్షణ చట్టాన్ని తీసుకొని రావడం జరిగింది. బీసీలను ఎమ్మెల్యే, ఎంపీ, నామినేటెడ్ పోస్టులను కల్పించిన నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నెల 19వ తేదీ డోన్ పట్టణం నందు మినీ మహానాడు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. అలాగే ఈ నెల 27, 28, 29న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించబోవు మహానాడు డోన్ మినీ మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

## రఘురామకృష్ణరాజు సేవలు ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిదాయకం

- డిప్యూటీ స్పీకర్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి

**పులివెందుల – సూర్య వాస్తవం :** ప్రజా జీవితంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సేవలు ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిదాయకమని పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు రఘురామ కృష్ణరాజు పుట్టినరోజు పురస్కరించుకొని పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి రఘురామకృష్ణరాజుని మర్యాదపూర్వకంగా కలిసి కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా జీవితంలో వారు అందిస్తున్న సేవలు, మార్గదర్శకత్వం ఎంతో స్ఫూర్తిదాయకం అని వారు నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురా రోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజా జీవితంలో మరింత రాణించి అన్ని వర్గాల ప్రజల మన్ననులు పొందాలని బీటెక్ రవి ఆకాంక్షించారు.



# పొదుపు మంత్రం మహానాడుకు వర్తించదా?

## - తులసిరెడ్డి సూటి ప్రశ్న



కనీస మద్దతు ధర ప్రకటిస్తానే సరిపోతుందా?

**వేంపల్లె - సూర్య వాస్తవం :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వల్లిస్తున్న పొదుపు మంత్రం టిడిపి మహా నాడుకు వర్తించదా? అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి చంద్రబాబును, టిడిపి నాయకులను సూటిగా ప్రశ్నించారు. గురువారం వేంపల్లి లో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 27,28, 29 తేదీలలో నెల్లూరులో తెలుగుదేశం పార్టీ మహానాడు ను నిర్వహిస్తోందని అన్నారు.27, 28 తేదీలలో 20వేల మంది తో ప్రతినిధుల సభ,29వ తేదీన 7 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని టిడిపి నిర్ణయించడం జరిగింది . అందుకు తగ్గట్టుగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.ఈ మహానాడు ను అత్యంత వైభవంగా, ప్రతిష్టాత్మకంగా, టిడిపి చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించాలని టిడిపి నేతలు నిర్ణయించారు.ఇది దుబారా కాదా? అని తులసి రెడ్డి ప్రశ్నించారు. ఒకవైపు పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలని ప్రధానమంత్రి మోడీ పొదుపు మంత్రం వల్లిస్తూ ఉంటే, మరొకవైపు చంద్రబాబు,టిడిపి నాయకులు మహానాడు కోసం పెట్రోల్,డీజిల్ వినియోగాన్ని విచ్చల విడిగా పెంచడం భావ్యమా అని తులసి రెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు, టీడీపీ నాయకులు దీనికి సమాధానం చెప్పాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

2026 - 27 ఖరీఫ్ కాలానికి సంబంధించి 14 పంటలకు కేంద్ర ప్రభుత్వం నిన్నటి రోజు కనీస మద్దతు ధరను ప్రకటించడం జరిగింది. మొక్కజొన్నకు క్వింటాలుకు కంటి తుడుపు చర్యగా కేవలం పది రూపాయలు మాత్రమే పెంచడం జరిగింది. అలాగే పెసలకు పిల్లికి బిచ్చం వేసినట్లు క్వింటాలకు 12 రూపాయలు మాత్రమే పెంచడం జరిగింది. రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించి అంతటితో తన పని అయిపోయినట్లు కేంద్ర ప్రభుత్వము చేతులు దులుపుకుంటూ ఉండడం దురదృష్టకరమని తులసి రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రైతుకు లభించనప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కొనుగోలు కేంద్రాలు తెరిచి రైతులు పండించిన పంటలను కనీస మద్దతు ధరకు కొనాలి.అప్పుడే ప్రకటించిన కనీస మద్దతు ధరకు సార్థకం ఉంటుంది, లేకపోతే ప్రకటించి ప్రయోజనం ఏమిటి? అని తులసిరెడ్డి సూటిగా ప్రశ్నించారు. గత రబీ సీజన్లో జొన్నకు కనీస మద్దతు ధరగా క్వింటాలకు 3699రూపాయలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగింది . కానీ మార్కెట్లో రైతులు వ్యాపారస్తులకు క్వింటాలుకు రు 2400 కు అమ్ముకున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.రైతుల వద్ద నుండి కొనలేదు.అదేవిధంగా గత రబీ సీజన్లో కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాలుకు కనీస మద్దతు ధర 2400 రూపాయలుగా ప్రకటించింది.కానీ మార్కెట్లో రైతుల వద్ద నుండి వ్యాపారస్తులు క్వింటాలకు పదహారు వందల రూపాయలకే కొనుగోలు చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచి రైతులను ఆదుకోలేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం గత రబీ సీజన్లో బుడ్డ శనిగకు క్వింటాలకు కనీస మద్దతు ధరను 5875 రూపాయలకు ప్రకటించింది. కానీ మార్కెట్లో వ్యాపారస్తులు రైతుల వద్ద నుండి క్వింటాలు బుడ్డ శనిగను రు 4600కి కొనుగోలు చేశారు. దీన్ని బట్టి చూస్తే కనీస మద్దతు ధర ప్రకటిస్తానే సరిపోదు.కనీస మద్దతుధర లభించనప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరకు కొంటేనే రైతుకు ఉపయోగం,కనీస మద్దతు ధరను ప్రకటించినందుకు సార్థకం ఉంటుందని తులసి రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు.

# నీట్ 2026 పేపర్ లీకేజీపై
# కేంద్రాన్ని నిలదీసిన ఏఐఎస్ఎఫ్ నాయకుడు



**ఉరవకొండ - సూర్యవాస్తవం :** దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నీట్-2026 పరీక్షా పత్రం లీకేజీ వ్యవహారంపై ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం తీవ్ర స్థాయిలో స్పందించింది. పరీక్షా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో విశ్వాసం దెబ్బతింటోందని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తగ్గపర్తి చందు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు వైద్య విద్యలో ప్రవేశం కోసం కఠినంగా శ్రమిస్తున్న సమయంలో నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రతి ఏడాది పరీక్షల నిర్వహణలో లోపాలు, అవక తవకలు, సాంకేతిక సమస్యలు బయటపడు తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమ ర్శించారు. జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత కలిగిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పై ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నాయని, అయినప్పటికీ కేంద్రం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందని ఆరోపించారు. నీట్ వంటి కీలక పరీక్షల్లో పేపర్ లీకేజీలు జరగడం వల్ల గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందన్నారు. కోచింగ్ మాఫియా, మధ్యవర్తులు, అవినీతి వలయం కారణంగా ప్రతిభకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలకు హాజరవుతుంటే, కొందరు డబ్బు, ప్రభావంతో ప్రశ్నాపత్రాలు సంపాదించడం విద్యా వ్యవస్థ పతనానికి నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి న్యాయ విచారణకు ఆదేశించి, పేపర్ లీకేజీ వెనుక ఉన్న అసలు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వ హణలో సమగ్ర సంస్కరణలు తీసుకు రావాలని కోరారు.

నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన వైఫ ల్యాల కారణంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఆందోళన, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చందు పేర్కొన్నారు. పరీక్షా వ్యవస్థపై విశ్వాసం పునరుద్ధ రించాలంటే బాధ్యులపై కఠిన చర్యలతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం అవసరమని స్పష్టం చేశారు. అలాగే నీట్ పరీక్షలను నిర్వహిస్తున్న ఎన్టీఏను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# ఎండిపోతున్న చీని, పండ్ల తోట
# రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి

## - సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్




**శింగనమల - సూర్య వాస్తవం :** సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో సింగనమల సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి రామకృష్ణ,జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్, ఆధ్వర్యంలో సింగనమల మండలం నాగుడ్డం తండా గ్రామంలో ఎండిపోయిన చీని చెట్ల రైతులు భాస్కర్ నాయక్, తిరుపాల్ నాయక్, నాగ ముని, పండ్లతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ... సింగనమల తాడిపత్రి నియోజకవర్గ ప్రాంతా ల్లోనే దాదాపుగా ముప్పై గ్రామాలలో 2000 ఎకరాల్లో చేతికొచ్చిన చీని పంట నిట్ట నిలువుగా ఎండిపోయినది అంటే జిల్లా వ్యాప్తంగా పండ్ల తోట రైతుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఒకసారి పాలకులు అధికారుల వ్యవస్థ పనితీరు ఎలా ఉందో ఒకసారి ఆలోచించండి చాలామంది రైతులు ఆశతో ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని వేలాది రూపాయలు ఖర్చుపెట్టి తెప్పించుకుని రక్షక తడులు అందిస్తున్న కూడా చెట్లు ఏమాత్రం బ్రతికే పరిస్థితి లేదు ఇంత జరుగుతున్న ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించిన పాపాన పోలేదు. చాలామంది రైతులు జిల్లా వ్యాప్తంగా మా బోరుబావులు ఎండిపోతున్నాయి మమ్మల్ని ఆదుకోవాలని జిల్లా అధికారులకి అర్జీలు ఇచ్చుకున్న ఫలితం మాత్రం శూన్యం కనీసం ఉద్యాన శాఖ అధికారులకు క్షేత్రస్థాయిలో ఇప్పటికైనా పరిశీలించి జిల్లా వ్యాప్తంగా ఏఏ పంటలు ఎండిపోతున్నాయి ఎన్ని బోరు బావులు ఎండిపోతున్నాయి వాటి నివేదికన జిల్లా స్థాయికి అధికారులకు అందించి వాటికి పంట నష్ట పరిహారం మరియు రక్షకతడులు అందించడానికి ప్రణాళికలను రూపొందించాలి.

ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పండ్ల తోట రైతులను ఆదుకోకపోతే ఆత్మహత్యలు శరణ్యమని రైతులు వాపోతున్నారు.ప్రభుత్వం చీని పండ్ల తోట రైతులకు నష్టపరిహారం అందించాలి ట్యాంకర్ల ద్వారా ఉచితంగా రక్షకతడులుఅందించి చీని పండ్లతోట రైతులను కాపాడాలి జలసిరి ద్వారా ఉచితంగా బోర్లు వేయాలి పండించిన పంటలకు మీరు ప్రకటించిన మద్దతు ధరలతో ప్రభుత్వం కొనుగోలు చేయాలి అరకొరగా పండిన చీని రైతులను మార్కెట్లో దళారులు వ్యాపారులు కుమ్ముక్కై సరైన ధర లేక నష్టపోతున్నారు అందుకోసం కోల్డ్ స్టోరేజ్ లో ఏర్పాటు చేయాలి సకాలంలో బిందు తుంపర్ సేద్య పరికరాలు రైతులకు అందించాలి స్వామినాథన్ కమిటీ సిఫార్సులు మేరకు మద్దతు రైతులు అందించి ప్రభుత్వమే అన్ని రకాల పంటలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి మరి ముఖ్యంగా చిని పండ్ల తోటల రైతుల సమస్యల పైన పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందించాలని ఈనెల 18 వ తారీకు సోమ వారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి జిల్లా వ్యాప్తంగా రైతులు కౌలు రైతులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ రైతు సంఘం ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి చేనేత మధు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మునుస్వామి, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పయ్యావుల కేశవ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేష్



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లోకేష్ పాటు ఇతర సహచర మంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని పయ్యావుల కేశవ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తన సహచర మంత్రుల కేరింతల మధ్య, ఆత్మీయ వాతా వరణంలో పయ్యావుల కేశవ్ కేక్ కట్ చేసి తన పుట్టినరోజును జరుపుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న పయ్యావుల కేశవ్ కి మంత్రులందరూ హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. క్లిష్ట సమయాల్లో రాష్ట్ర ఆర్థిక శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తున్న పయ్యావుల కేశవ్ కి, తోటి మంత్రుల నుంచి లభించిన ఈ ఆత్మీయ గౌరవం వారి మధ్య ఉన్న సమన్వయానికి మరియు స్నేహపూర్వక బంధానికి నిదర్శనం.

### ప్రజానాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జనసేన ఇంచార్జి గౌతమ్ కుమార్



జనసేన ఉరవకొండ ఇంచార్జి గౌతమ్ కుమార్ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు. నిబద్ధతకు నిలువెత్తు రూపం. ప్రజా సేవలో అలు పెరగని పోరాటం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, ఉరవకొండ శాసనసభ్యులు పయ్యావుల కేశవ్‌కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు మరెన్నో ఏళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ, నిరంతరం ప్రజల సేవలో కొనసాగాలని, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను అన్నారు.

# నూతన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన జేసీ అస్మిత్ రెడ్డి



**తాడిపత్రి - సూర్య వాస్తవం :** పెద్ద పప్పూరు మండలం తబ్జుల గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తాడిపత్రి నియోజకవర్గ శాసనసభ్యులు జె.సి. అష్మిత్ రెడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. నూతన కార్యాలయం అందు బాటులోకి రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాలన ప్రజలకు మరింత చేరువవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యాలయం ప్రారంభించిన అనంతరం, ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలను, గ్రామంలోని యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాండురంగస్వామి స్వామి ఆలయానికి వెండిపాదాలు అందించిన ప్రవీణ్ కుమార్





**పామిడి- సూర్య వాస్తవం :** పామిడిలోని భావసారా క్షత్రియ డబ్బిదార్ ఫిర్కా వారు నూతనంగా నిర్మించిన రుక్మిణి సమేత పాండురంగస్వామి దేవాలయంలోని పాండురంగస్వామి స్వామికి వెండిపాదాలు తయారు చేయుంచి ఇచ్చిన దాత మహేంద్రకర్ ప్రవీణ్ కుమార్ అందించారు. పామిడి లోస్త్రీల నైటీలు తయారు చేయు పేద కార్మికుడునిగా పనిచేస్తారు. తాను సంపాదించి దాచుకున్న లక్ష రూపాయలు డబ్బు భగవంతుని సేవకు ఖర్చు చేయాలన్న సంకల్పం మనసులో వెలిసింది. వెంటనే కొత్త విగ్రహానికి కొత్త వెండి పాదాలు చేయుంచాలని సంకల్పంతో తల్లి సక్కు బాయికి తెలిపారు. ఆమెకూడ సమ్మతి తెలపడం తో లక్ష రూపాయల వ్యయంతో పాదాలు తయారు చేయుంచి ఆలయ అధ్యక్షులు జె. శ్రీనివాస రావుకు అందించారు.

# ప్రజాదర్బార్లో అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



**మడకశిర - సూర్య వాస్తవం :** ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో చేపట్టిన, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటికి సత్వర పరిష్కారం చూపడం. స్థానిక మరియు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వారి సమస్యలు ఎమ్మెల్యే కు అర్జీలు సమర్పించారు. ప్రజల నుండి స్వయంగా అర్జీలు స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అందిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత శాఖల అధికారులకు పంపి, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకోవడానికి ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్థానిక సమస్యలు రోడ్లు, తాగునీరు, పెన్షన్లు మరియు ఇతర సంక్షేమ పథకాలు నేరుగా ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుంది.

# మార్కెట్ యార్డులో చోరీ



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న రూమ్ నెంబర్ 2 వెంకటేశ్వర మండిలో బీరువా పగలగొట్టి బీరువాలో ఉన్న 30వేల నగదును దోచుకెళ్లినట్లు మండి యజమాని రమణారెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డ్ లో అర్ధరాత్రి కూడా చీనా కాయలు అన్లోడ్ చేస్తుంటారు. మండీలకు తాళాలు కూడా వేయకపోవడంతో మండీలో ఉన్న బీరువాను రాడ్ల సహాయంతో పగలకొట్టి బీరువాలో ఉన్న 30వేల నగదును దుండగులు దోచుకెళ్లారు. తెల్లవారు జామున చోరీ జరిగిన సంఘటన తెలుసుకొని మండి యజమాని రమణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తెలిసిన వ్యక్తుల చేసిన పనే అని కొందరు వ్యాపారస్తులు అంటున్నారు. ఏదేమైనప్పటికీ విచారణలో తెలియాల్సి ఉంది.

# వైసీపీ అభిమానుల నడుమ చెన్నకేశవరెడ్డి నూతన గృహప్రవేశం





**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ, కత్రిమల చెన్నకేశవరెడ్డి ఎద్దులపల్లి రోడ్డులో ఉన్నటువంటి నూతన గృహప్రవేశానికి వారి ఆహ్వానం మేరకు జిల్లా వైయస్సార్సీపి ఇంచార్జ్ అనంత వెంకట్రామిరెడ్డి, గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వై,వెంకట్రామిరెడ్డి, నైరుతి రెడ్డి,మధుసూదన్ గుప్తా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పలువురు వైయస్సార్ సిపి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున కలిసి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం పాలొన్నారు. కుటుంబ సభ్యులు, సమక్షంలో వేద మంత్రోచ్చారణల మధ్య గృహ ప్రవేశ వేడుక ఆధ్యాత్మిక వాతావరణంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో పారిశుద్ధ్యంను మరింత మెరుగుపరచాలి

- 20 రోజుల్లో మార్పు రావాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం - సూర్య వాస్తవం :** నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యంను మరింత మెరుగు పరిచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నగరంలో శానిటేషన్ నిర్వహణపై నగరపాలక సంస్థ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్ల పరిధిలో శానిటేషన్ కు సంబంధించి డోర్ టు డోర్ మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. చెత్తను తీసుకుని వెళ్లే వాహనాలకు సంబంధించి రియల్ టైం మానిటరింగ్ కోసం కార్యాచరణ ప్రణాళిక తయారు



చేయాలన్నారు. నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు సంబంధించి 20 రోజుల్లో ఖచ్చితంగా మార్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయం వారిగా డస్ట్ బిన్ లను ఎప్పుడు తొలగిస్తారు, ఏ సమయంలో తొలగిస్తారు అనేది ప్రణాళిక ఉండాలన్నారు. చెత్త తరలింపులో ప్రణాళిక సరిగా ఉండాలని, పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, ఇన్చార్జి ఎంహెచ్వో సునీత, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# ముమ్మరంగా 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ'

- జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా ప్రజల రక్షణే ధ్యేయంగా, నేరాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు బుధవారం అర్ధ రాత్రి 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ' నిర్వహించారు. ఈ ఆపరేషన్లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలు మరియు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకున్నారు. పలువురిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు.అర్ధరాత్రి వేళ అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న వారిని విచారించి, సరైన కారణం లేని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించి వేశారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచారు. కాలనీల్లో మరియు వ్యాపార సముదాయాల వద్ద దొంగతనాలు జరగకుండా ఉండేందుకు పోలీసు బృందాలు నిరంతరం గస్తీ నిర్వహించాయి. ఈ సందర్భంగా జిల్లాఎస్పీమాట్లాడుతూ..... ప్రజలు ప్రశాంతంగా నిద్రపోయేలా ఈ ఆపరేషన్ నైట్ సేఫ్టీ నిరంతరం



కొనసాగుతుంది. ప్రజలు పోలీసులకు సహకరించాలి. ఏదైనా అనుమానాస్పద వ్యక్తి లేదా వస్తువు కనిపిస్తే వెంటనే డయల్ '100'/112 లేదా సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలన్నరు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో జిల్లాలోని ఆయా డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు..

# నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహ ఏర్పాటుకు సహకరించండి

**- మున్సిపల్ కమిషనర్ను కోరిన తెదేపా నాయకులు**



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల మున్సిపల్ పరిధిలో స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని ఎంత కాలం నుండో తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న స్వర్గీయ ఎన్టీఆర్కి పులివెందుల ప్రాంతాల్లో చాలా మంది అభిమానులు ఉండటం అందరికీ తెలిసిన విషయ మేనని ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటుతో ప్రజల్లో ఇటు టీడీపీ పార్టీ క్యాడర్లో మరియు అభిమానులు సంతోషపడే విధంగా త్వరలో నియోజకవర్గ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రా రెడ్డి ఆధ్వర్యంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో మున్సిపల్ కమీషనరతో చర్చించి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలు పరిశీలన చేయడం జరిగింది. ఈ కార్యక్రంలో స్టేట్ ఉర్దూ డైరెక్టర్ మహబూబ్ బాషా,అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి, నల్లగారి భాస్కర్ రెడ్డి, మల్లుకుంట్ల గంగాధర్ రెడ్డి, బీజేపీ లక్ష్మయ్య, వేంకటేశ్వర రెడ్డి ఇతర కూటమి నాయకులు పాలొన్నారు.

# బాడీ ఫ్రీజర్స్ నిల్వకు నూతన భవనం ప్రారంభం

**- మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ అధ్యక్షులు డాక్టర్.యోగేశ్వర్ బాబు**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** రాజీవ్ నగర్ కాలనీలో దాతల సహకారంతో బాడీ ఫ్రీజర్స్ నిల్వ ఉంచడానికి ఏర్పాటు చేసిన నూతన భవనాన్ని గురువారం మధ్యాహ్నం ప్రారంభించడం జరిగిందన్నారు. రాజీవ్ నగర్ కాలనీలో దాతల సహకారంతో బాడీ ఫ్రీజర్స్ నిల్వ ఉంచడానికి ఏర్పాటు చేసిన నూతన భవనాన్ని కొన్ని అనివార్య కారణాల వల్ల అనుకోకుండా గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ చక్రపాణి రెడ్డి, టీచర్ కవి వరప్రసాద్, డాక్టర్ రంగయ్య, గంగయ్య, చల్ల బాలాజీ సుభాష్, సుబ్బయ్య,రాజు పసుపులేటి సుబ్బయ్య, లెక్చలర్ రాముని రెడ్డి పాల్గొన్నారు.

# బీసీలను, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలను ప్రభుత్వ ఆదుకోవాలి

**- మంత్రి సవితను కలిసిన వేంపల్లె మండల నాయకులు**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లె మండలానికి సంబంధించిన గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు ప్రభుత్వం సహాయం మరింత చేరే విధంగా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ను వారి నివాసంలో కలవడం జరిగిందని తెలిపారు.అలాగే మండలానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సింగారెడ్డి రామముని రెడ్డి, మహమ్మద్, రాజ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పార్నపల్లి రోడ్డు సర్కిల్ను వాసవి సర్కిల్ ఏర్పాటుకు నిర్ణయం



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందులలోని పార్నపల్లి రోడ్డు సర్కిల్ ను వాసవి సర్కిల్ గా ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న చర్యల గురించి మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ తో ఆర్యవైశ్య నాయకులు చర్చించారు. వివరాలలోకి వెళితే నిత్యం రద్దీగా ఉండే పార్నపల్లి బస్టాండ్ ను వాసవి సర్కిల్ గా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ అనుమతించిన నేపథ్యంలో వాటికి సంబంధించి సాధ్యాసాధ్యాలను మరియు సెంటర్ ఏర్పాటు చర్యల గురించి ఆర్యవైశ్య సభ్యులు మున్సిపల్ కమిషనర్ తో గురువారం చర్చలు జరిపారు వాటిలో భాగంగానే ఆ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి విధివిధానాలను రూపొందించే ప్రయత్నం చేశారు.

# ఆ వివాదం నాలో మార్పు తెచ్చింది...

## లోకజ్ఞానం పెంచుకున్నా: నిత్యా మీనన్

ప్రభాస్ గురించి జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు నిత్యామీనన్ సమాధానంపై అప్పట్లో దుమారం ఒక్క మాటను పట్టుకుని రాద్ధాంతం చేశారన్న నిత్యామీనన్

ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండకూడదని నిర్ణయించుకున్నానని వెల్లడి తన కెరీర్ ప్రారంభంలో ఒక హీరో గురించి అడిగిన ప్రశ్న, ఆ తర్వాత తనను ఇబ్బంది పెట్టిందని, దీంతో తాను లౌక్యంగా మాట్లాడడం నేర్చుకున్నానని ప్రముఖ సినీ నటి నిత్యామీనన్ అన్నారు. ఆమె కెరీర్ ప్రారంభంలో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, "ప్రభాస్ ఎవరు?" అని రిప్లయ్ ఇవ్వడం అప్పట్లో చర్చకు దారి తీసింది. ఈ అంశంపై ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె స్పందించారు.

ఆ సమయంలో తాను చాలా అమాయకంగా ఉండేదానని, ఒక్క మాటను పట్టుకుని రాద్దాంతం చేయడం తనను చాలా ఇబ్బందికి గురిచేసిందని అన్నారు. తన నిజాయతీని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఈ విషయాన్ని పెద్దది చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండడం పనికిరాదన్న విషయం అర్థమైందని వెల్లడించారు.


కొన్నిసార్లు తెలివిగా మాట్లాడటం అవసరమని తాను తెలుసుకున్నానని అన్నారు. ప్రతి ఒక్కరు తన నిజాయతీకి అర్హులు కారని అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఆ తర్వాత తాను లోకజ్ఞానాన్ని పెంచుకున్నానని అన్నారు. నాడు ప్రభాస్ అంశం కారణంగా తాను ఎంతో ఇబ్బందిపడ్డానని వాపోయారు.

దాదాపు రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండి, తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించానని తెలిపారు. ఆ సమయంలో కొన్ని ఫేక్ ఫొటోలు సృష్టించి తనను మానసికంగా కృంగదీసే ప్రయత్నం చేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు తనకు జీవితంలో ఎంతో నేర్పాయని, అప్పటి నుంచి తాను



# దర్శకుడిగా మారుతున్న హీరో రామ్...

## రేపే ప్రకటన



రెండు దశాబ్దాల పాటు కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్

ఇక మెగాఫోన్ పట్టనున్న ఎనర్జిటిక్ స్టార్

23వ చిత్రంతో దర్శకుడిగా అదృష్టాన్ని పరీక్షించుకోనున్న వైనం

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని దర్శకుడిగా మారనున్నారు. 'దేవదాసు' చిత్రంతో హీరోగా రామ్ ప్రయాణం మొదలైంది. తనదైన నటన, చలాకీతనంతో, అదిరిపోయే డ్యాన్సులతో అభిమానులను సంపాదించుకున్నారు. రెండు దశాబ్దాల పాటు కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్ ఇప్పుడు మెగా ఫోన్ పట్టుకోనున్నారు. రామ్ హీరోగా నటిస్తున్న తదుపరి చిత్రంలో అభిమానులకు అదిరిపోయే వార్త సిద్ధమైంది.

హీరోగా తన 23వ చిత్రానికి రామ్ స్వయంగా దర్శకత్వం వహించనున్నాడు. ఈ చిత్రంతో ఆయన దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన రేపు శుక్రవారం ఉదయం 10:08 గంటలకు అట్టహాసంగా వెలువడనుంది. తాను దర్శకుడిగా మారనున్నట్లు రామ్ రేపు అధికారికంగా ప్రకటించనున్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్టు కావడంతో, ఆయనే దర్శకత్వం చేయాలనుకుంటున్నారు.

ఈ చిత్రానికి సంబంధించి ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సామ్ పీఎస్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక పూర్తయ్యాక, తర్వాత రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అభిమానులు రేపు రామ్ అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.



# తిలక్ వర్మ డైనమిక్ బ్యాటింగ్..

## పంజాబ్‌పై ముంబై థ్రిల్లింగ్ విక్టరీ

- పంజాబ్ కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్ విజయం
- 201 పరుగుల భారీ లక్ష్యాన్ని 19.5 ఓవర్లలో ఛేదించిన ముంబై
- కేవలం 33 బంతుల్లో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచిన తిలక్ వర్మ

ధర్మశాల వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 201 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఖరి ఓవర్లో ఛేదించింది. యువ బ్యాటర్ తిలక్ వర్మ (75లి) అజేయ అర్ధ శతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించగా, బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో సత్తా చాటాడు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ముంబై ముందు పంజాబ్ 201 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (32 బంతుల్లో 57) హాఫ్ సెంచరీతో మెరవగా, చివర్లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (17 బంతుల్లో 38) మెరుపు ఇన్నింగ్స్‌తో స్కోరును 200కు చేర్చాడు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 39 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి పంజాబ్ జోరుకు అడ్డుకట్ట వేశాడు.

భారీ లక్ష్య ఛేదనలో ముంబైకి ఓపెనర్ రియాన్ రికిల్టన్ (23 బంతుల్లో 48) అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. మధ్యలో స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడినప్పటికీ, క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కేవలం 33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి విల్ జాక్స్ (10 బంతుల్లో 25లి) చక్కటి సహకారం అందించడంతో ముంబై మరో బంతి మిగిలి



ఉండగానే విజయాన్ని అందుకుంది. టోర్నీ నుంచి ఇప్పటికే ఎలిమినేట్ అయిన ముంబై ఇండియన్స్ ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ అవకాశాలను దెబ్బతీసింది. పంజాబ్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉన్నప్పటికీ, ఇతర మ్యాచ్ ల ఫలితాలు ఆ జట్టు అవకాశాలపై ప్రభావం చూపుతాయి.



# క్వార్టర్స్‌లో సింధు

- సాత్విక్, చిరాగ్ జోడీ సైతం
- థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500

**బ్యాంకాక్ (థాయ్‌లాండ్):** భారత అగ్రశ్రేణి షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో పి.వి సింధు 21-13, 21-15తో డెన్మార్క్ షట్లర్ అమేలిపై అలవోక విజయం సాధించింది. 28 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తు చేసిన సింధు నేడు క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ నం.3 అకానె యమగూచి (జపాన్)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ లక్ష్యసేన్ సైతం క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. 21-12, 21-13తో చైనా షట్లర్ జు చెన్‌పై లక్ష్యసేన్ గెలుపొందాడు. 39 నిమిషాల పాటు సాగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్లో రెండు గేముల్లోనూ లక్ష్యసేన్ పైచేయి సాధించాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ సైతం క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపారు. 21-12, 21-19తో 44 నిమిషాల మ్యాచ్‌లో మలేషియా జోడీపై మనోళ్లు మెరుపు విజయం నమోదు చేశారు. వరల్డ్ నం.4 సాత్విక్, చిరాగ్‌లు నేడు క్వార్టర్‌ఫైనల్లో జపాన్ జోడీ నొమురు, షిమోగమిలతో పోటీపడనున్నారు. ఇదిలా ఉండగా, మెన్స్ సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ పోరాటానికి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోనే తెరపడింది. 70 నిమిషాల ఉత్కంఠ పోరులో 16-21, 21-1, 18-21తో చైనీస్ తైపీ షట్లర్ చేతిలో కిదాంబి శ్రీకాంత్ పోరాడి ఓడాడు. మహిళల సింగిల్స్‌లో దేవిక 21-23, 11-21తో థాయ్‌లాండ్ షట్లర్ పిచమాన్ చేతిలో పోరాడి ఓటమిపాలైంది.

# సేవల్లో వేగం నాణ్యత,
# పారదర్శకతతో అధికారులు పనిచేయాలి

## - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** జిల్లాలో వేగవంతమైన ప్రభుత్వ సేవలు, పారదర్శక సంక్షేమ పథకాల అమలుతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదే శించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సేవల్లో వేగం నాణ్యత, పారదర్శకత పెంపొందించడంపై కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించడం, ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించడం, శాఖల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన సూచనలు జారీ చేశారు. పట్టణాలు, గ్రామాల్లో పారిశు ధ్ద్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై తదితర సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు సురక్షితమైన , అందుబాటులో ఉన్న రవాణా సేవలు అందించడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి, పంటలపై అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక సలహాలు అందిస్తూ వారికి అండగా నిలవాలని తెలిపారు. విద్యా శాఖ అధికారులు పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, విద్యార్థులు-ఉపాధ్యాయుల హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి డ్రాపౌట్స్ తగ్గించాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. మందులు, వైద్య పరీక్షలు, అత్యవసర సేవలు ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. తల్లి-శిశు ఆరోగ్యం, అంటు



వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య శిబిరాల నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహిం చాలని సూచించారు. ఆర్టీసీ అధికా రులు ప్రయాణికులకు సురక్షి తమైన, సమయ పాలనతో కూడిన రవాణా సేవలు అందిం చాలని, బస్సుల పరి శుభ్రత, గ్రామీణ ప్రాంతాల్లో సేవల విస్తరణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదు లపై వెంటనే స్పందించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేయాలని, విద్యుత్ అంతరాయాలు తగ్గిస్తూ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రభుత్వ గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి శాఖ ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం లేకుండా స్పందించాలని, శాఖల పనితీరు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేసేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విద్యా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :**
జిల్లాలో విద్యాభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపు లక్ష్యంగా పనిచేయాలని విద్యాశాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లోపాఠశాల విద్య, ఇంటర్మీ డియట్ విద్య, సమగ్ర శిక్షా, స్కిల్ డెవలప్మెంట్, అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరానికి గాను "బడి పిలు స్తోంది" కార్యక్రమానికి సంబంధించి ప్రస్తుతం విద్యార్థుల నమోదు పరంగా జిల్లా ఆరో స్థానంలో ఉన్నదని, రాబోయే రోజుల్లో ఇంకా మెరుగైన స్థానాల్లో నిలవడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అన్నారు. రాయచోటి, పీలేరు, మదనపల్లి, వాయల్పాడు, గాలివీడు, పుంగనూరు తదితర ఆరు మండలాల్లో నమోదు ప్రక్రియ చాలా తక్కువగా ఉందని సంబంధిత మండలాల అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. జిల్లాలోని 89 మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 కంటే తక్కువగా ఉన్న నేపథ్యంలో, ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు ఇంకా మెరుగుపడేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పదో తరగతి ఫలితాల విశ్లేషణలో సైన్స్ మరియు తెలుగు సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు గుర్తించి, వారికి ప్రత్యేక రిమీడియల్ తరగతులు నిర్వహించి అందరూ ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం మొదటి నుంచే సైన్స్, తెలుగు సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రాథమిక చదువు, లెక్కల సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. మార్చిలో నిర్వహించిన ఎండ్‌లైన్ పరీక్షల్లో 898 పాఠశాలలు మంచి ఫలితాలు సాధించాయని, వచ్చే ఏడాదికి కనీసం 75 శాతం పాఠశాలలు ఈ స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. మన బడి మన భవిషత్తు పనులను ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే సకాలంలో పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందిం చేందుకు ప్రత్యేక చర్యలు నిర్వహించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఫలితాల శాతం పెంచేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు శిక్షణ పొంది ఉద్యోగాలు పొందిన వారి పూర్తి వివ రాల నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఐఈఓ రవి, డిఈవో సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీమతి అనురాధ, స్కిల్ డెవలప్మెంట్ అధికారి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల నూతన
# ప్రిన్సిపల్‌గా ముండ్లపాటి చంద్రశేఖర్

**బ్రహ్మంగారిమఠం -సూర్య వాస్తవం:** బ్రహ్మంగారి మఠంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ముండ్లపాటి చంద్రశేఖర్ గురువారం నాడు బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ... గత కొన్ని రోజులుగా స్థానిక సోషల్ మీడియాలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల మీద వస్తున్న వార్తలకు స్వస్తి పలుకుతూ కళాశాల కరస్పాండెంట్ ఎస్ కే వల్లినాకు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు అప్పచెప్పారు కళాశాల కరస్పాండెంట్ ఆదేశాల మేరకు నేను నేటి నుండి కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్నానని నేటి నుండి నేను శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆశీర్వచనములతో మీడియా మిత్రులు పెద్దల సహాయ సహకారాలతో బ్రహ్మంగారి మఠం మండల వ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థులకు అందరికీ విజ్ఞప్తి చేస్తూ మా కళాశాల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా నియమ నిబంధనలు పాటిస్తూ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడం నా బాధ్యతని అంతేకాకుండా డిగ్రీ కళాశాల ద్వారా ఉద్యోగ ఉపాధి కల్పన కు అవకాశం కలిగేలాగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లతో మా కళాశాలను అనుసంధానం చేసుకొని ఇక్కడ చదివిన విద్యార్థులకు చదువు అయిపోగానే ఉద్యోగం పొందే లాగా కృషి చేస్తానని నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చిన కళాశాల కరస్పాండెంట్ ఎస్ కే వల్లికి ప్రత్యేక



కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మండల ప్రజల సహాయ సహకారాలతో మీ అందరి సలహాలు తీసుకొని కళాశాల అభివృద్ధికి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తానని వారు తెలియజేశారు.

# మంత్రి నారా లోకేష్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో కార్యక్రమాలకు పాల్గొనడానికి పుట్టపర్తి విమానా శ్రయానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మంత్రి నారా లోకేష్ తొలిసారి అనంతరం జిల్లాకు రానున్న నేపథ్యంలో లోకేష్ పర్యటనకు నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయగా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో తొలిసారి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో తెదేపా శ్రేణులు భారీగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు నిర్వహించారు.

# ఇది లీకుల కేంద్ర ప్రభుత్వం !

**-విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి**
**-కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి**
**-డిసిసి అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ డిమాండ్**




**రాయచోటి - సూర్య వాస్తవం :** నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం, నీట్ పరీక్ష రద్దు చేయడం చాలా బాధాకరమని అన్నమయ్య డిసిసి అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. గురువారం అయన సూర్య వాస్తవం ప్రతినిధితో మాట్లాడుతూ మోడీ పాలనలో ఎన్నో సార్లు పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయని, పరీక్షలు రద్దు అయ్యాయని మోడీ ప్రభుత్వానికి ఇదేం కొత్త కాదు, ఇది లీకుల కేంద్ర ప్రభుత్వం అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి ఇది నిదర్శనమన్నారు.

**లక్షలాదిమంది విద్యార్థులు మోడీ పాలనా తీరు తప్పు పడుతున్నారు**

పరీక్షలు కూడా పకడ్బందీగా నిర్వహించలేని కేంద్ర ప్రభుత్వంగా లక్షలాదిమంది విద్యార్థులుమోడీ ప్రభుత్వం పాలన తిరును తప్పు పడుతున్నారని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా విద్యార్థిని విద్యార్థులకు నరేంద్ర మోడీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి. అలాగే కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# జనగణన 2027 సర్వే ప్రోగ్రెస్‌ను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి అర్బన్ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వా ల ఆదేశాల మేరకు జన గణన 20 27 సర్వే భాగంగా గుత్తి మున్సిపాలిటీలో 96 మంది ఎన్యుమరే టర్లు తో 88 బ్లాకులకు 16 మంది సూపర్ వైజర్లతో పర్యవేక్షణకు నియమింపుతో జరుగుచున్న సర్వే ప్రోగ్రెస్‌ను తనిఖీ చేసిన మున్సిప ల్ కమీషనర్ బి.జబ్బార్ మియా ఈ సందర్భంగా వారు ఈ ప్రకటన ద్వా రా గుత్తి మున్సిసిపాలిటి యందు గృహాల గణన ప్రక్రియ ప్రోగ్రెస్ పరం గా 12,141 గృహాల సర్వే జరిగినదని తెలియజేశారు.ముఖ్యముగా పట్ట ణము యందు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా, ఎన్యుమరేటర్ల సందర్శన సర్వే ద్వారా ప్రోగ్రెస్ మెరుగై న స్థాయిలో ఉందని తెలుపుతూ త మ ఇంటి వద్దకు వచ్చిన ఎన్యుమరే టర్లకు సహకరించి వివరాలు అంద జేయాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చే శారు.ఈ సర్వే ప్రక్రియలో ప్రస్తుతం మే 1వ తేదీ నుండి మే 31 వరకు గృహాల గణన జరుగునని మరియు జనవరి 2027 నుండి జనగణన జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం వారు ఆదేశించిన ఆదేశాల మేరకు త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లకు కమీషనర్ బి.జబ్బార్ మియా ఆదేశించారు.

# మారేపల్లిలో కిడ్నాప్ ఘటనపై సీఐ స్పందన



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి మండలం మారేపల్లిలో గురు వారం చోటుచేసుకున్న కిడ్నాప్ ఘ టన వార్తలపై సీఐ రామారావు వాస్త వాలను వెల్లడించారు.నారాయణ స్వామికి చెందిన కుమారుడు హేమ తేజ(2) ఇంటి వద్ద ఆడుకుంటుండగా మతిస్తిమితం లేని వ్యక్తి వచ్చి ఎత్తుకోవడానికి ప్రయత్నించగా తల్లి అప్రమత్తమై బాబును లాక్కుందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు సదురు వ్యక్తిని పోలీసులకు అప్ప గించారు.విచారణలో ఆ వ్యక్తికి మ తిస్తిమితంలేదని తేలిందన్నారు.అ తను గత రెండు రోజులుగా మార్నే పల్లి క్రాస్ ఐఓసీ పెట్రోల్ బంక్ పరిస రాలలో తిరుగుతున్నట్లు ఉపాధి హా మీ కూలీలు కూడా గుర్తించారు.మా ర్నేపల్లిలో ఎలాంటి కిడ్నాప్ ప్రయ త్నం జరగలేదు.కేవలం మతిస్థిమి తంలేని వ్యక్తి ప్రవర్తన వల్ల గ్రామస్థు లు కిడ్నాప్ అని భావించారు.మీడి యా మిత్రులు ఈ వాస్తవాన్ని గమ నించి ప్రజలను అప్రమత్తం చేయా లని కోరుతున్నాము.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )